క్లుప్తంగా

నేడు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



నక్కలపల్లి సమీపంలో భూమిపూజ చేసే మూసీ వాగు

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలకు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు హాజరుకానున్నారు. చిన్నమంగళారం మహరాజ్‌పేట్ మూసీవాగుపై, నక్కలపల్లి ఈసీవాగుపై వంతెనల నిర్మాణాలకు రూ.5 కోట్లు చొప్పున నిధులు మంజూరయ్యాయి. అలాగే.. 1.30 కోట్ల నిధులతో చేపట్టనున్న అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఉదయం 10 గంటలకు మంత్రులు ప్రారంభించనున్నారు.

రేపు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చేవెళ్ల: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, మైనార్టీ సంఘం నాయకులు, ముస్లింలు, లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నిర్ణీత సమయానికి పరీక్ష సెంటర్‌కు చేరుకోవాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ

మొయినాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి ఆదివారం ప్రవేశ పరీక్ష కేంద్రం తమ కళాశాలలో ఏర్పాటు చేశారని సాంఘిక సంక్షేమ వికారాబాద్ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు. సమయం కంటే ముందే పరీక్షా సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు.

ధ్యానంతో వ్యాధులు దూరం

ధ్యాన ప్రచార కార్యకర్తలు స్వప్న, వెంకటలక్ష్మి



అవగాహన కల్పిస్తున్న వెంకటలక్ష్మి

షాబాద్: మహిళలు ధ్యానం చేయడం ఆరంభిస్తే జీవితం ఆరోగ్యంగా సాగిపోతుందని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యకర్తలు స్వప్న, వెంకటలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బోనగిరిపల్లి, దైవాలగూడ, అంతిరెడ్డిగూడ, నాంధార్‌ఖాన్‌పేట్, దామర్లపల్లి, సాయిరెడ్డిగూడ గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఇల్లు, పిల్లలు, ఉద్యోగం వంటి ఎన్నో బాధ్యతలు నిర్వర్తిస్తూ ఒత్తిడితో సతమతమవుతుంటారు. ధ్యానం చేయడం దినచర్యగా చేసుకుంటే ఒత్తిడి నుంచి బయటపడవచ్చని తెలిపారు. ధ్యానంతో ఎటువంటి వ్యాధులనైనా తగ్గించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు బంగ్లా ఆంజనేయారెడ్డి, నవీన్, శ్రీనివాస్, బాలకృష్ణారెడ్డి, రాధ, సుభద్ర, స్వప్న, కృష్ణమద్దిలేటి, రాంచంద్రయ్య, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

తెగులు నివారణకు చర్యలు

మండల వ్యవసాయాధికారి అరుణకుమారి



వరి పంటను పరిశీలిస్తున్న అరుణకుమారి

ఆమనగల్లు: వరిలో వచ్చే తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. శనివారం ఆమె మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న ఇతర పంటలను పరిశీలించారు. అలాగే భాస్వరం కరిగించు జీవన ఎరువు వాడిన వరిపంటను ఆమె పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. వరిలో వచ్చే అగ్గితెగులు, ఆకు ఎండు తెగులు, ఆకుమచ్చ తెగులు నివారణకు ట్రై సైకలాజోల్ 0.6 గ్రాములను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరినాటిన 25 రోజుల లోపు పటేరా గుళికలను వాడినట్లయితే కాండం తొలచు పురుగును నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీశైలం, నారయ్య, రాములు, శ్రీశైలం, జంగమ్మ, అంజమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే వాహనాల పార్కింగ్

- స్తంభించిపోతున్న ట్రాఫిక్
- చలాన్లపైనే పోలీసుల దృష్టి



మొయినాబాద్ ప్రధాన చౌరస్తాలో నిలిచిపోయిన ట్రాఫిక్

మొయినాబాద్: మండలంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపైన వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ప్రధాన చౌరస్తాలో వాహనాలు ఎటు నుంచి ఎటు పోతున్నాయో అర్థం కాని పరిస్థితి. నాలుగు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు రావడం వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. హైదరాబాద్ మహానగరానికి అతి చేరువలో ఉన్న మొయినాబాద్ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. హోటళ్లు, షాపులు ప్రధాన రహదారికి దగ్గరగా ఉండి సరైన పార్కింగ్ స్థలాలు లేక వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసినా దాన్ని పూర్తి స్థాయిలో వినియోగించకపోవడంతో వాహనదారులు ఎటుపడితే అటు వెళ్తున్నారు. దీంతో వెనక నుంచి వచ్చే వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అవుతుంది. మరో పక్క రహదారికి ఇరుపక్కల ఉన్న షాపులు, హోటళ్లు, బ్యాంకుల ఎదుట వాహనాలను ఇష్టం వచ్చినట్లు పార్కు చేస్తున్నారు. దీంతో రహదారిపై వెళ్లే వాహనాలకు ఇబ్బందులు తప్పడం లేదు.. అలాగే, ప్రధాన చౌరస్తాలో ఉదయం పూట వందల మంది అడ్డాకూలీలు రోడ్డుపైనే నిలబడతారు. వీరి వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పాటు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి.

చలాన్లపైనే ధ్యాస

ట్రాఫిక్ సమస్యను క్లియర్ చేయాల్సిన ట్రాఫిక్ పోలీసులు చలాన్లు వేయడానికే ప్రాధాన్యమిస్తున్నారు. ట్రాఫిక్ జామ్‌ను పట్టించుకోకుండా రోడ్డు పక్కన పార్కు చేసిన వాహనాల ఫొటోలు తీసి ఇష్టానుసారంగా చలాన్లు వేస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు. రోజుకు సుమారు 200 నుంచి 300 వాహనాలకు చలాన్లు వేస్తున్నారని తెలిసింది.

బస్టాపుల్లో పార్కింగ్...

బస్టాపుల్లో ఆటోలు నిలుపుతుండడంతో బస్సులు వచ్చి రోడ్డుపైనే ఆగుతున్నాయి. వెనుక నుంచి వచ్చిన వాహనాలు బస్సుల వెనకాలే ఆగడంతో బస్సులు కదిలేంత వరకు ట్రాఫిక్ నిలిచిపోతుంది. రోడ్డుకు ఇరువైపుల ఉన్న షాపుల ముందు టీ పాయింట్లు, జ్యూస్ బండ్లు, పానిపూరీ బండ్లు ఏర్పాటు చేయడంతో షాపుల ఎదుట పార్కింగ్ స్థలం లేకుండా పోతుంది. వీటి కారణంగా మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. పోలీసులు ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు,వాహనదారులు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం



ట్రాఫిక్ సమస్య పరిష్కారానికే సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేశాం. త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తాం. రోడ్డుకు ఇరుపక్కల ఉన్న షాపులకు సంబంధించి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచిస్తున్నాం. బస్టాపుల వద్ద పార్కింగ్ చేసే వాహనదారులపై చర్యలు తీసుకుంటాం.

– లవకుమార్, ట్రాఫిక్ సీఐ, రాజేంద్రనగర్

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎంపీపీ రవీందర్ యాదవ్



పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కేశంపేట: గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని ఎంపీపీ ఎల్లనమోని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని మంగళిగూడలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో నిరుపేదల ఆడపిల్లలకు లబ్ధి చేకూరుతోందని చెప్పారు. రాష్ట్ర పథకాలను పేర్లను మార్చి ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేకు పాలాభిషేకం

మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. మండలంలో పంచాయతీ రాజ్ విభాగంలో పీడబ్ల్యూ రోడ్డు కొత్తూర్ నుంచి లింగంధన వరకు రూ.20 కోట్లు, జేపీ దర్గా నుంచి ఎక్లాస్‌ఖాన్‌పేట వరకు రూ.6కోట్లు, జేపీ దర్గా నుంచి వేములనర్వ వరకు రూ.10కోట్లు నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో కేశంపేట, మంగళిగూడ గ్రామాల సర్పంచులు వెంకట్‌రెడ్డి, ఇందిరమ్మ, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, వైస్ ఎంపీపీ అనురాధ, రాములు నాయక్, కృష్ణయ్య, అంజిరెడ్డి, సురేశ్‌రెడ్డి, నవీన్‌కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్తార్ విందులు



విందులో పాల్గొన్న ముస్లింలు, నాయకులు

చేవెళ్ల: మండలంలోని కేజీఆర్ గార్డెన్‌లో శనివారం సర్పంచ్ బండారి శైలజ, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా అన్ని పండుగలను జరుపుకోవాలని కోరారు. అలాగే, మల్కాపూర్‌లో ఉప సర్పంచ్ జాఫర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం నాయకులు సత్యనారాయణ రెడ్డి, వెంకటస్వామి, వసంతం, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మధుసూదన్‌గుప్తా, ఎంపీటీసీ జి. రాములు, పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ చేయాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

కేశంపేట: ప్రొబేషన్ పీరియడ్ ముగిసిన తమను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి శనివారం పంచాయతీ జూనియర్ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగేళ్ల గడువు పూర్తయినా రెగ్యులరైజేషన్‌ను చేయడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోట్ చేయాలని కోరారు. ఇటీవల మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 317 జీఓలో నష్టపోయిన పంచాయతీ కార్యదర్శులకు న్యాయం చేయాలని విన్నవించారు. పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింహులు, కార్యదర్శులు రవీందర్, భాస్కర్, సంపత్‌కుమార్, వరలక్ష్మి, లక్ష్మీప్రసన్న, సౌమ్య, వెంకటేష్, విజయసింహ, స్నేహలత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలు ఘనత మాదే

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



కొత్తూరు: చెక్కులు పంపిణీ చేస్తున్న అంజయ్యయాదవ్

నందిగామ: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలను పెంచి పేదల నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. అనంతరం ముస్లింలకు రంజాన్ తోఫాను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గణేష్, ఎంపీపీ ప్రియాంక, సర్పంచులు అశోక్, కుమార్, స్వామి, రమేష్‌గౌడ్, నర్సింహులు, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షురాలు లత, ఎంపీటీసీలు దేపల్లికుమార్, చంద్రపాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ముత్యాల నర్సింహ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

కొత్తూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు రంజాన్ తోఫాను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎమ్మె శ్రీలత, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ ఎంపీపీ శోభ, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

షాద్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. సీఎం కేసీఆర్ అన్ని మతాలను సమానంగా చూస్తున్నారని చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

సీఐ గురువయ్యగౌడ్



నాగర్‌గూడ వద్ద బొల్లార్డ్స్ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

షాబాద్: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ఎంతో కృషి చేస్తున్నారని సీఐ గురువయ్యగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని నాగర్‌గూడ, సీతారాంపూర్, ఆస్పల్లిగూడ, అంతారం, కుర్వగూడ, సర్దార్‌నగర్ స్టేజీల వద్ద చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులతో కలిసి బొల్లార్డ్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. వాహనదారులు రోడ్డు కండిషన్ చూసుకుని డ్రైవింగ్ చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. ట్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్‌లో వాహనాలను నడిపితే జరిమానా విధిస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి, సిబ్బంది

చేవెళ్ల: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి భిక్షపతి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం చేవెళ్లలోని బస్‌స్టేషన్, మార్కెట్ యార్డు, తదితర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే తమకు ఫోన్ చేయాలన్నారు. వేసవి కాలంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎండీ.గౌస్, సురేందర్, గోపాల్, ఖాజా, తదితరులు ఉన్నారు.

దళితరత్న అవార్డు అందజేత



అవార్డు అందుకున్న రాజు

మొయినాబాద్: మండలంలోని సురంగల్ గ్రామానికి చెందిన బేగరి రాజు దళితరత్న అవార్డును అందుకున్నారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజు కొన్ని సంవత్సరాలుగా బాబు జగ్జీవన్ రామ్, మహాత్మాజ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల కోసం పనిచేస్తూ ప్రతి ఏటా మహనీయుల ఉత్సవాలను ఘనంగా జరుపుతున్నాడు. ఆయన సేవలకు శుక్రవారం నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం తరఫున మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ జంగా శ్రీనివాస్ దళితరత్న అవార్డును ప్రదానం చేశారు. శాలువ కప్పి జ్ఞాపికను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు శ్రీనివాస్, ప్రమోద్ తదితరులు ఉన్నారు.

రైతులకు పీఏసీఎస్ చేయూత

పీఏసీఎస్ చైర్మన్ అశోక్



లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న అశోక్

నందిగామ: పీఏసీఎస్‌లు ఇచ్చే రుణాలను రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ జి.అశోక్ అన్నారు. చేగూరులోని పీఏసీఎస్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పీఏసీఎస్‌ల ద్వారా రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటుందని చెప్పారు. రైతులకు కావాల్సిన ఎరువులు అందిస్తూ, తక్కువ వడ్డీకే రుణాలను ఇస్తుందని చెప్పారు. కల్లాల వద్దనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు, వ్యాపారులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను సైతం అందిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇద్దరు లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సీఈఓ వెంకటయ్య, డైరెక్టర్లు మల్లేష్, బాలమ్మ, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

బీఎస్పీ నాయకుడు మోజెస్ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నేతలు

షాద్‌నగర్‌టౌన్: పట్టణంలోని కసం ఫోరూం సమీపంలో ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని బీఎస్పీ నేతలు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు మోజెస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు గుంతలు పడిన ప్రదేశాన్ని సందర్శించి నీటి గుంతల్లో దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైప్‌లైన్ లీకేజీ కారణంగా పగిలి రోడ్డుపై నీరు పారుతోంది. దీంతో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిందన్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర ఎన్నో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రయాణీకులు గుంతల్లో పడి గాయాల పాలయ్యారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, రాజేష్‌చౌహాన్, శ్రీను రాథోడ్, శివకుమార్, ఉదయ్‌కృష్ణ, వీరేందర్, నర్సింలు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంతో రవాణా వ్యవస్థ మెరుగు

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: సీసీ, బీటీ రోడ్ల నిర్మాణంతో రవాణా వ్యవస్థ మెరుగుపడుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని సలాపూర్‌గ్రామంలో రూ.10లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం రూ.15లక్షలతో నిర్మించిన రోడ్ల పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామంలో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. గిరిజన తండాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో నియోజకవర్గ పరిధిలో 22 బీటీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.36.93కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. నూతన పంచాయతీల్లో గ్రామ పంచాయతీ భవనాలను నిర్మిస్తున్నట్లు వివరించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి పట్ల వివక్ష చూపుతోందని ఆరోపించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దశరథనాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్ విజయలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యురాలు ప్రియరమేశ్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, సర్పంచ్ కృష్ణయ్య, ఉప సర్పంచ్ సంతోష, ఎంపీటీసీ సభ్యులు లచ్చిరాంనాయక్, మంజుల, గోపాల్, నాయకులు శ్రీశైలం, శంకర్, పాండునాయక్, రమేశ్, పంతునాయక్, ప్రకాశ్, వాహిద్, జగన్, శ్రీను, టాక్యా, చందు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన సింగిల్‌విండో వైస్ చైర్మన్ కూన రవి కుమార్ తల్లి కూన అచ్చమ్మ (80) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వెల్జాల్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహంపై పుష్ప గుచ్ఛాలుంచి నివాళి అర్పించారు. అనంతరం చంద్రధనకు చెందిన నిఖిల్‌కు ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబర్ రహ్మాన్, జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, నాయకులు వెంకటయ్య, లింగంగౌడ్, శేఖర్, శ్రీశైలం, మల్లేశ్, మోహన్‌లాల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

- లక్ష్మీనర్సింహ స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆచారి తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్‌లో శనివారం లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. బుసిరెడ్డి శిల్పారఘుమారెడ్డి, మొగిలిశెట్టి సరితాజగన్ దంపతులు కల్యాణం జరిపించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

హాజరైన నేతలు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీఆర్‌ఎస్ నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మండల డోకూరి ప్రభాకర్‌రెడ్డి, ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వీరిని ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదములు అందజేశారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవ, బండ్లు తిప్పుటకార్యక్రమాలును నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శేఖర్‌గౌడ్, సర్పంచ్ రమేశ్ యాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు సునీత, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబుర్ రహ్మాన్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అంజన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అంబాజీ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసమూర్తి, లక్ష్మారెడ్డి, సర్పంచ్ కుమార్, ఉప సర్పంచ్ అనిల్, అజీం, లక్ష్మీనారాయణ, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.